# ఒయాసిస్

గ్రామీణ జీవితాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన డా. లంకిపల్లె అక్కడి రైతుల కష్టసుఖాలను చిత్రీకరించడంలో సిద్ధహస్తులు. పట్టణాలకు వెళ్ళి చదువుకొన్న యువతీ యువకుల మనోభావాలను ఆయన సాధికారంగా తన కథలలో ఆవిష్కరిస్తారు.

రవి, సౌమిత్రి వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ఎలాగో చోటు చేసుకొన్నారు. పి.జి.పరీక్షలయిన తరువాత రవి మిత్రుడు సౌమిత్రితో ఊరి ప్రయాణం. రవి ఫస్ట్ క్లాస్ టికెట్ కొంటాడనుకొన్నాడు సౌమిత్రి. జన సందడిలో సెకండ్ క్లాసులో ఎక్కడమే సాహస కృత్యమనిపించింది. ఎండ తీవ్రంగా ఉంది. క్రిక్కిరిసిన పెట్టెలో ఊపిరి పీల్చడం కష్టంగా ఉంది. రైలు కదిలింది. కొంత రిలీఫ్ కలిగింది. రైలు రాయల్ చెరువు గేటు దాటింది. వింత శబ్దం. రైలు ఆగింది.

వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌కు తిరుపతి నుండి పాకాల వరకు ఎక్కడా స్టాపింగ్ లేదు. అయినా బయలుదేరిన మూడు నిమిషాలకే ఆగింది. ఎవరో చైను లాగారు- విద్యార్థులు కొంతమంది రైలు వెనుక పరుగు నడకతో వస్తున్నారు. అంత అర్జంటు పని ఏమో మరి. మరో అరగంటలో మీనాక్షి ఎక్స్‌ప్రెస్ ఉంది. అంతవరకు ఆగలేరు. రైలును ఆపడం వాళ్ళ హక్కు. వడగాలి విసురు ఎక్కువయింది. సౌమిత్రి విసుక్కున్నాడు. రవి మెల్లగా నవ్వాడు. పది నిమిషాలకు రైలు కదిలింది. ముందు సీట్లో యువ దంపతులు, మూడేళ్ళు నిండని పాప ఉన్నారు. పాప ముద్దుగా ఉంది. డ్రెస్ అందంగా, ట్రిమ్‌గా ఉంది. అమ్మ ఒడిలో ముచ్చటగా ఆడుకొంటూ ఉంది. పాప సౌమిత్రిని చూసి చిరునవ్వు నవ్వింది. చిన్నారి చిరునవ్వుతో సౌమిత్రి మురిసిపోయాడు. రమ్మని సైగ చేశాడు. రానని తల అడ్డంగా తిప్పింది.

"టాయ్‌లెట్ సెట్టు పెట్టావా?"

భర్త అడిగాడు, ఏదో జ్ఞాపకమొచ్చినట్లు. ఆమె వెతికింది. టాయ్‌లెట్ సెట్టు కనిపించలేదు. ఆమె వెతుకుతూ ఉండగానే భర్త దండకం మొదలు పెట్టాడు.

"నా కర్మకొద్దీ దొరికావు. అన్నీ నేనే పట్టించుకోవాలి- లేకపోతే జరిగేది ఇదీ."

"పెట్టానండీ! మరలా సర్దినప్పుడు..."

ఆమె సంజాయిషీ పూర్తికాలేదు.

"సరిగా సర్దడానికి నీకు టైమ్ ఎక్కడుంది? ప్రయాణం చేసే రోజు కూడా స్నేహితులు, షాపింగ్..."

వెటకార్యంతో అతని ముఖం మూడు వంకరలు పోయింది.

"సూట్‌కేస్‌లో చూద్దామండి. లేకపోతే ఫోన్ చేద్దాం. వారం రోజుల్లో అన్నయ్య వస్తానన్నాడుగా. అంతవరకు పాత సెట్ ఉంది."

"నీ మాటలూ నువ్వూను. బి.ఎ. చదివినంత మాత్రాన ఏం లాభం?"

ఉరిమి చూశాడు అతను. బి.ఎ. చదవడానికి, టాయ్‌లెట్ సెట్ మరచిపోవడానికి సంబంధం ఏమిటి? ఆమె సంభాషణ మార్చాలని ప్రయత్నించింది. అతని దండకం బారినుండి తప్పించుకోవాలని విఫల ప్రయత్నం. మెల్లగా నవ్వుతూ అన్నది:

"ఇక్కడే చదివానండి. బి.ఎ.ఫస్ట్ క్లాస్."

రైలు పద్మావతి కాలేజీ ముందు వెళ్తూ ఉంది.

"అంతా బట్టీయం చదువు. జీవితంలో ఉపయోగపడని చదువెందుకు? బుద్ధి లేకపోతే సరి"

అతనేం చదివాడో తెలియదు. అతని మాటలు కర్కశంగా ఉన్నాయి. ఆమె కళ్ళనిండా నీళ్ళు నిండాయి.

"మమ్మీ, ఇక్కడే చదివావా? అయితే నేను కూడా ఇక్కడే చదువుతా మమ్మీ!"

ముత్యాల మూట విప్పినట్లు పాప మాటలు. అతని విసుర్ల వేడి వడదెబ్బకు పదిరెట్లు. ఆమె ముఖం కమిలిన తమలపాకులా అయింది. ఆమె పాప చేతులు రెండూ ముఖానికి అడ్డు పెట్టుకొన్నా కళ్ళ కాటుక కరిగింది. చిన్న విషయానికి భార్యను అంత తీవ్రంగా గాయపరచ వలసిన అవసరమేముంది? అంతా గమనిస్తున్న సౌమిత్రికి బాధ కలిగింది.

చిన్న పట్టణమైన తిరుపతికి ప్రపంచ స్థాయిలో ప్రసిద్ధి ఉంది. కారణం- వెంకటేశ్వరుని నిలయం కావడం. విద్య వెలలేని భూషణం మనిషికి. తిరుపతి పట్టణానికి అమూల్య అలంకారాలు కాలేజీలు. రైలు కాలేజీలు దాటింది. శ్రీనివాస మంగాపురం, చంద్రగిరి, కొటాల, ముంగిలిపట్టు, అక్కడక్కడ చెరకు, వరి, ఆకు తోటలు, పచ్చని పైర్లు వెనక్కు వెళ్తూ ఉన్నాయి. పైరుగాలి ఆహ్లాదంగా ఉంది. సౌమిత్రి కన్నార్పకుండా చూస్తూ కూచున్నాడు. అతి రుచికరంగా పాప ముద్దు మాటలు దొర్లుతున్నాయి. రైలు ఆగింది. ఎవరో చైను లాగారు. పదిమంది విద్యార్థులు రైలు దిగి వెళ్లారు ఠీవిగా. రైలు సిబ్బందికి ఎదురయ్యే గడ్డు సమస్య - ఎవరినీ ఏమీ అనలేని, దండించలేని పరిస్థితి. తోటి ప్రయాణీకుల ద్వారా తెలిసిన విషయం- పట్టుమని పది ఇళ్ళు లేని ఊరు. ఆ ఊరిలో సాయంకాలం పెళ్లి. అందుకే రైలు ఆగింది.

**మిత్రులు దిగారు. పాప 'టాటా' చెప్పింది. పాప అమ్మ ముఖంలో కళ, కాంతి లేదు. పదిమందిలో పరాభవం.**


పి.ఎస్.బాబు



ఆ పెళ్ళిపెద్దలకోసం ఆగిన రైలు కదిలింది. ఒక ముసలాయనకు పెద్ద సందేహం వచ్చింది. అక్కడ దిగిన వారందరూ టికెట్లు కొన్నారా? మరొకరి సమాధానం- టికెట్లు తీసుకొన్నవారు రావలసిన సమయానికే వస్తారు. మధ్య మధ్య రైలును ఆపవలసిన అవసరం ఉండదు. టికెట్లు కొన్నవారి కంటే లేనివారి సంఖ్య ఎక్కువ. అందుకే రైలు ఎక్కడైనా ఆగుతుంది. సౌమిత్రికి అమధ్య టి.వి.లో వచ్చిన జానపద గేయం జ్ఞాపకం వచ్చింది.

"బండిరా, పొగబండిరా. అది దొరలెక్కే రైలుబండిరా."

ఆ పాట రైళ్ళు ప్రారంభమయినప్పుడు రాసింది. గ్రామాలలో కోలాటపదంగా ప్రసిద్ధికెక్కింది. తెల్లదొరలు పోయారు దేశం వదలి. తెల్లదొరలు రైలెక్కే కాలంలో మధ్యలో రైలును ఆపే ధైర్యం ఎంతమందికి ఉండేది? పాకాల స్టేషను చేరకముందే బస్సు స్టాండు దగ్గర మరోమారు



ఆగింది రైలు. విద్యార్థులు దిగారు. పాకాల స్టేషనులో చాలామంది దిగారు. జనసమ్మర్దం తగ్గింది. సర్దుకొని కూచున్నాడు సామిత్రి.

కొండలు, కోనలు, వాగులు దాటి వెళ్తూ ఉంది రైలు. ప్రకృతి నగ్న స్వరూపం సామిత్రిని ఆకర్షించింది. వంకలు, వాగులు ఎండిపోయాయి. మిట్టవల్లాలన్నీ నిర్జీవం. కనుచూపుమేరలో పచ్చదనం కనిపించలేదు. అది వేసవి కల్పించిన దిగంబర దృశ్యం.

రైలు ఒక మిట్టమీద ఆగింది. మిత్రులు దిగారు. పాప 'టాటా' చెప్పింది. పాప అమ్మ ముఖంలో మొదటి కళ, కాంతి లేదు. పదిమందిలో పరాభవం. ఆ వడ దెబ్బనుండి ఇంకా తేరుకొన్నట్లు లేదు.

పొద్దుగ్రుంకే సమయం. సామిత్రి చుట్టూ కలయజూశాడు. ఎక్కడా ఊరు జాడ కనిపించలేదు. అంతా ఎర్రచెక్క భూమి. గాలికి ధూళి పొరలు పొరలుగా లేస్తూ ఉంది. ఎర్రటి ఎడారిలా తోచింది.

**నిత్యం రగిలే పగలో సామాన్య జనం ఊపిరి పీల్చుకోవడానికి కష్టపడేవారు. బ్రతుకు తెరువులు బండలయ్యాయి.**

"రవీ, మీ ఊరెక్కడ?"

"ఆరు మైళ్ళు బస్సులో వెళ్లాలి. ఒక మైలు నటరాజ సర్వీసు చేయాలి. అంతవరకు మా ఊరు కనిపించదు."

రైలు స్టేషను నుండి పడమరగా ఫర్లాంగు దూరం వెళ్ళారు మిత్రులు. బస్సు వచ్చింది. బస్సులో దూరడానికి సందులేదు. బస్సు నిండా జనం. శెనగల బస్తాల్లా కూరుకుపోయారు. బస్సు టాపుమీద జనం. రవి చేతిలోని సూట్‌కేసు అందుకొన్నాడు కండక్టర్. కండక్టర్ చేతినుండి మరోవ్యక్తి అందుకొన్నాడు. ముందుకు జరిగి జనాన్ని సర్దుకోమని గట్టిగా అరిచాడు కండక్టర్. బస్సు ఎక్కడానికి సందు దొరికింది. రవిని చూసిన వెంటనే వెనుక సీట్లో కూర్చున్నవారు లేచారు. ఎంత వారించినా వినలేదు. మిత్రులు కూచున్నారు. మట్టిరోడ్డు ప్రయాణం. స్ప్రింగ్ మంచంలా ఎగురుతూ ఉంది వెనుక సీటు. ఎర్రటి దుమ్ము పౌడరులా ముఖానికి అతుక్కొంటూ ఉంది. బస్సు మైలుకొకచోట ఆగి ఆగి వెళ్తూ ఉంది. బస్సు కుదుపులకు సామిత్రి వెన్నెముక అదిరిపోయింది. నడుంలో నొప్పి పుట్టింది. సామిత్రికి మొదటిసారిగా రవి మీద కోపం వచ్చింది. బస్సు ఆగింది. అంతవరకు రవి సూట్‌కేస్ భుజంమీద పెట్టుకున్న మనిషి దిగాడు. రవి వెంట సామిత్రి కూడా దిగాడు. మసక చీకటి. సామిత్రికి కొంత భయంగానే ఉంది. రవి వెంట తొట్రుపాటుతో యాంత్రికంగా నడిచాడు. దారి పరిచయమున్నవారికి సాఫీగా నడక సాగుతూ ఉన్నా సామిత్రికి నడక తడబడుతూ ఉంది. సూట్‌కేస్ తీసుకెళ్ళిన మనిషి ద్వారా మిత్రుల రాక వార్త ఊర్లో తెలిసింది. టార్చి లైటుతో ఇద్దరు మనుమలు ఎదురు వచ్చారు. మిత్రుల దగ్గరున్న బ్యాగ్‌లు అందుకొన్నారు. సామిత్రిలో భయం తగ్గింది. మనసు తేలికపడింది. రవి ఇంటిగేటు దగ్గరే ఎదురయింది రేణుకాదేవి. చెప్పకుండా చీకటిలో వచ్చినందుకు రవిని మందలించింది. సామిత్రిని ఆప్యాయంగా పలకరించింది. ఆమె రవి తల్లి అనుకొన్నాడు సామిత్రి. ఆమె హుందాగా ఉంది. రాజసం ఉట్టిపడే విగ్రహం, మాట, నడక.

చాలా విశాలమైన ఇంటి కాంపౌండ్ విస్తీర్ణం ఎకరానికి తక్కువ కాని చతురస్రాకారపు స్థలం. కాంపౌండు లోపల చుట్టూ కొబ్బరి చెట్లు కోటకు కావలాకాసే సిపాయిల్లా ఉన్నాయి. పశువుల పాకలు, పాతకాలపు గుర్రపు బండి, ట్రాక్టరు అన్నీ కాంపౌండు లోపలే ఉన్నాయి. మధ్యలో పెద్ద మేడ. ఇల్లు పాతది. కాని అన్ని సౌకర్యాలు సక్రమంగా అమర్చినట్లున్నాయి.

మిత్రుల స్నానాలు, భోజనాలు ముగిశాయి. మేడపైకి వెళ్ళారు. చుట్టూ టెంకాయచెట్ల ఆకుల నీడన చల్లని గాలి మనోల్లాసంగా ఉంది. రెండు మంచాలు తెచ్చారు. మంచంకోళ్ళ కోళ్ళు శ్రీచందనంతో మలచిన, పనస చెక్కలు పరచిన మంచాలు. మంచాల పైన పలచగా నీళ్ళు చల్లారు. చల్లగాలిలో కమ్మని వాసన చోటు చేసుకొన్నది. మెత్తని బూరగదూది పరుపులు మంచాల మీద వేశారు. తెల్లని పరుపు కవర్లు, దిండ్లు వెన్నెట్లో తడిసినట్లు మెరిశాయి. సామిత్రి మెత్తమీద వెల్లికిలా పడుకొన్నాడు. తన ఇంట్లో ఎయిర్-కండిషన్డ్ బెడ్‌రూమ్ కంటే ఎంతో హాయిగా ఉంది. మొదటిసారిగా ఆకాశం చూసినట్లుంది. చంద్రుడు టెంకాయ చెట్లపైకి వచ్చాడు. పైకి చూస్తున్న సామిత్రికి వింత అనుభూతి - చంద్రుడు మేఘమాలికలతో దోబూచులాడుతూ పరుగెడుతున్నట్లు! తారలు అతని చుట్టూ రాగమాలికలు ఆలాపిస్తున్నట్లు! వాస్తవం వేరు, అనుభూతి వేరు, అనుభవం వేరు. మనస్సు ఆహ్లాదంగా ఉంది. ఒళ్లు తెలియని నిద్ర ముంచుకొచ్చింది.

ఉదయం గాయత్రి పఠిస్తున్న సామిత్రిని ఎంతగానో మెచ్చుకొన్నది రేణుకాదేవి. టిఫిన్ తనే అమర్చింది. సామిత్రికి పప్పుల పొడి, నెయ్యి, ఇడ్లీ బాగా నచ్చాయి.

"నేను భోజనప్రియుణ్ణి. మంచి నెయ్యి వాసనతో మరింత ఆకలి కలిగింది. మీరేమీ అనుకోకండి" అన్నాడు సామిత్రి.

రేణుకాదేవికి అతని పద్ధతి బాగా నచ్చింది. టిఫిన్ అయింది. గ్లాసులనిండా కొబ్బరినీరు. కొత్త వాతావరణం, సరికొత్త రుచులు. సామిత్రి సంతోషంగా అన్నాడు :

"చాలా మంచి విందు. ఇంతవరకు తినలేదు. ఇకమీదట కూడా ఇటువంటి వంటలు తినే అదృష్టం ఉండదు."

"కలెక్టరువై రా. తప్పకుండా ఇలాంటి విందే ఎదురు చూస్తుంది."

అది రవి జవాబు.

రవి అమ్మతో మిత్రుని ప్రతిభను గురించి చెప్పాడు. సామిత్రి తాత వేద పండితుడు. తిరుమలపై పెద్ద జియ్యరు. తండ్రి పెద్దకంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్. సామిత్రి ఇంగ్లీషు లిటరేచర్ చదివాడు. రూపుదాల్చిన సంస్కారం, కాలంతో మారగల తెలివితేటలుగల మనుమలు అనుకొన్నది ఆమె.

"సామిత్రీ, రవి పోలీసు ఆఫీసర్ అయ్యే అవకాశం ఉందా?"

ఆరడుగుల ఎత్తు, విశాలమైన ఎదురుఛాతీ, బలిష్ఠమైన శరీరం. చూపును ఆకట్టుకోగల అందం రవిది.

"రవి రూపం, తెలివితేటలలో నాకంటే మిన్న. రవి అనుకొంటే రెండేళ్లలో ఐ.పి.యస్. ఆఫీసర్ కాగలడు."

"సామిత్రి కలెక్టర్, నువ్వు పోలీసు ఆఫీసర్ అయితే, అప్పుడయినా నా కోరిక తీరుస్తావా, రవీ!"

రేణుకాదేవిలో ఠీవీ, హుందాతనం మూల పడ్డాయి. ఏదో గూడుకట్టుకొన్న ఆవేదన, దీనభావం చోటు చేసుకొన్నాయి. అంతవరకు నవ్వుతూ అమ్మతో పసి పిల్లవాడిలా మురిపెంగా మాట్లాడుతున్న రవి తలవంచుకొన్నాడు. క్షణాలు మౌనంగా గడచిపోయాయి. రేణుకాదేవి మెల్లగా వెళ్లింది, కళ్లద్దాలు సవరించుకుంటూ, రవిని అదోలా చూస్తూ.

గుండ్లవంక కిరువైపులా అక్కడక్కడా కొద్ది కొద్దిగా పైర్లు ఉన్నాయి. దాదాపు ఆ ప్రదేశమంతా పైరు పచ్చలు లేక ఎడారిలా ఉంది. గుండ్లవంక కొకవైపున కోటపల్లె, రెండోవైపున మిట్టపాళ్యం గ్రామాలు ఆ ప్రాంతంలో చెప్పుకోదగ్గ ఊళ్ళు. ఆ గ్రామాల మధ్య ఏదో కారణంగా కొట్లాటలు జరుగుతూ ఉండేవి.

అది నీటికాలువ తగాదా కావచ్చు, మేకపిల్ల అటువైపు వెళ్ళడం కావచ్చు, ఆవుదూడ ఇటువైపు రావడం కావచ్చు. అసలు కారణం వేరు. నిత్యం రగిలే వగలో సామాన్య జనం ఊపిరి పీల్చుకోవడానికి కష్ట పడేవారు. బ్రతుకు తెరువులు బండలయ్యాయి. మిట్టపాళ్యం జమీందార్ల హెూదాలో కొన్ని తరాలు రవి తాతలు, ముత్తాతలు ఏలుబడి సాగించారు. అందులో చివరివాడు రవి తండ్రి. ప్రజా జీవనం అంటే అర్థం తెలియని మనుషులు. కోటపల్లె పెద్దలు అంతకంటే ఛాందసులు, మూర్ఖులు. ఈ ప్రాంతం ఇంత వెనుకబడి ఉండడానికి కారణమేమని సౌమిత్రి అడిగిన ప్రశ్నకు సంక్షిప్తంగా రవి చెప్పిన సమాధానం అది.

రవి, సౌమిత్రి మామిడి తోపులోకి వెళ్ళారు. ఇరవై ఎకరాల విస్తీర్ణం గల తోపు. మిట్టమధ్యాహ్నం కూడా ఎండ నేలమీద పడనంత గుబురు చెట్లు. ఎండు కొమ్మ, ఎండుటాకు వెదికినా కనిపించనంత బాగా పోషించిన తోట. ఒక యానాది కుటుంబానికి బ్రతుకు తెరువు ఆ తోటపని. ఆ తోపు మధ్యలో రవి త్రవ్వించిన పెద్ద బావి ఉంది. సౌమిత్రి తొంగి చూశాడు. పెద్ద కోనేరులా ఉంది. నీరు ముప్పై అడుగులున్నా అట్టడుగు అద్దంలా కనబడుతూ ఉంది. సౌమిత్రి ఆ ప్రదేశాన్నంతా ఒకమారు పరికించి చూశాడు. ఆ ఎడారిలో మామిడి తోపు ఒయాసిస్‌లా తోచింది. సంవత్సరానికి లక్ష రూపాయల నికరాదాయం మామిడితోపు మాసూలు.

"సౌమిత్రీ, నీకు ఈత వస్తుందా?"

"రాదు."

రవి యానాదిని పిలిచి చెప్పాడు. గంటలో ఈతకు కావలసిన పరికరాలు తయారయ్యాయి. యానాది బావిలోకి దిగాడు. సౌమిత్రికి ఈత నేర్చుకోవాలని ఉంది. కాని భయమేసింది. రవి బావిలోకి దూకాడు. సౌమిత్రి భయ పడుతూనే దిగాడు. నడుంకు దారం, ట్యూబు మధ్య తను. చల్లటి పన్నీరులా ఉంది నీరు. సౌమిత్రి రెండు చుట్లు తిరిగాడు బావి చుట్టూ. భయం పోయింది. ఒక గంటసేపు ఈత కొట్టి అలసిపోయాడు. అలా ఈ కార్యక్రమం మూడు రోజులు సాగింది. ఈత నేర్చుకొన్నాడు సౌమిత్రి.

ఊరికి దక్షిణంగా వెళ్లారు మిత్రులు. అస్థిపంజరాలు కదులుతున్నట్లుంది మనుషుల నడక. ముఖాలలో జీవకళ లేదు. కళ్ళలో రేపటి ఆశ - వెలుగు లేదు. యాంత్రికంగా కదులుతున్నారు. వారి వెంట ఉన్న పశువులు, కుక్కలు అలాగే ఉన్నాయి. మొరిగే శక్తిలేని కుక్కలు! మేపే రూపు, అది కరవైన వికృత రూపాలు పశువులు. వారి కష్టార్జితం ఏమవుతూ ఉంది? కాపుల కష్టం, భూపుల సంపద? సౌమిత్రికి అదొక శాపగ్రస్త ప్రదేశంలా తోచింది. సమయానికి వాన పడితే పంట, పండుగ. వాన ఏ దశలో గతి తప్పినా పంటలు ఎండిపోతాయి. కరవు పక్కున నవ్వుతుంది. కక్ష సాధిస్తుంది. చేతి కష్టం మీద బ్రతికే జన జీవనం బండబారుతుంది.

మరికొంత దూరంలో సుమారు నూరు ఇండ్లు హంపీ శిథిలాల్లా కన్పడ్డాయి. ఒకప్పుడు తుంగభద్రా నది ఒడ్డున విజయనగర వైభవానికి గుర్తు హంపీనగరం. శిలలో జీవిత సౌభాగ్యాన్ని చిత్రించిన శిల్పులు. మణులు, మాణిక్యాలు రాసులు పోసి అమ్మిన వ్యాపారులు, శిలా స్తంభాలలో సంగీత స్వర మేళనం చేసిన అమర గాయకులు- ఎన్నో వైభవాలు- మహత్తరమైన సంపదలు మనిషి ఈర్ష్యకు గురి అయినాయి. కక్షకు బలి అయినాయి. కాని హంపీ శిథిలాలు ఆనాటి వైభవాన్ని వేనోళ్ళ చాటుతున్నాయి. తుంగభద్రా నది జీవన గీతం నిరంతరం వినిపిస్తుంది.

ఇక్కడ గుండ్లవంక కిరువైపులా ఉన్న శిథిలాలు సామాన్య జనానికి గృహ వసతి ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనాలు. గృహప్రవేశం లేకనే శిథిలాలైనాయి. జనం వెనుకటి పూరిగుడిసెలకు దూరం కాలేదు. ఆ అవకాశం వారికి దక్కలేదు. కారణం- మనిషిలో స్వార్థం పెరగడం.

"ఎందుకు మనుషులిలా ఉన్నారు?"

సౌమిత్రి ప్రశ్న ఎయిర్-కండిషన్డ్ ఇంట్లో నివాసం, కారులో కాలేజీకి రాక. మరి సామాన్య మనుషులెలా ఉంటారో ఎలా తెలుస్తుంది? రవి కళ్లముందు తను చదివిన చరిత్ర స్వరూపం ఆవిష్కృతమయింది. రాజ్యం వీరభోజ్యం! అది ఒకప్పటి నిజం. తంత్ర మంత్రాంగ పాలన కొన్ని శతాబ్దాలు. విజ్ఞాన శాస్త్ర వికృత రూపం అణుబాంబు నడిపేది నేటి చరిత్ర. ఎప్పుడూ దోపిడీకి, హింసకు గురవుతూ ఉంది సామాన్య ప్రజ. రక్తం మరకలతో నిండిపోయిన పుటలు చరిత్ర. ఎడారిలో ఒయాసిస్‌లా ఎప్పుడో కొన్ని శతాబ్దాల కొకమారు, కొన్నివేల పేజీలలో ఒక పేరా, ఎక్కడో ఒక చోట సామాన్య మూగజీవుల ఆర్తి, అవసరాలు ఆదుకొన్న నేతలు, పథకాలు, శాసనాలు-. అవి సాంఘిక జీవన ప్రతిబింబాలు. ఇదే నిజమైన సజీవ చరిత్ర. సామాన్య ప్రజాజీవనం సరళంగా సాగిన చరిత్ర నిజమైన చరిత్ర. అదే చరిత్ర జీవనాడి. మనిషిలో మానవత లోపించినప్పుడు పెద్ద అఘాతం. పెద్ద ఎడారి. కోటపల్లె, మిట్టపాళ్యం నేడు - హిరోషిమా, నాగసాకి ఆనాడు. మనుషులు సృష్టించిన ఎడారులు ప్రమాదకరమైనవి, సహజసిద్ధంగా ఏర్పడిన ఎడారుల కంటే. ఎలా వివరించి చెప్పాలో అర్థం కాలేదు రవికి. పేలవంగా నవ్వాడు. ఆ నవ్వులోని విషాదం అర్థం కాలేదు సౌమిత్రికి.

గుడిసెల మధ్య పెంకుటిల్లు. 'శిశువిహార్' బోర్డు కనిపించింది. మూడు - ఐదు సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలు బిలబిలమంటూ బయటి కొచ్చారు. కొత్తగా తోచింది సౌమిత్రికి.

"ఏమిటిది?" - సౌమిత్రి అడిగాడు.

"కాన్వెంట్." రవి నెమ్మదిగా చెప్పాడు.

"అంటే క్రెష్ సెంటర్?"

"అవును."

ఎడారిలాంటి పల్లె బ్రతుకుల మధ్య ఒయాసిస్ శిశువిహార్. సౌమిత్రి మనస్సు కదిలింది.

"ఎలా నడుస్తూ ఉంది ఈ శిశువిహార్?" - సౌమిత్రి అడిగాడు.

"హృదయం కల దాతల చేతి చలువ. ఆలోచన గల మనిషి నిర్వహణలో నడుస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ అనుగ్రహం. ఈ ప్రాంతంలో ఇలాంటి శిశు విహార్‌లు ఇరవై ఉన్నాయి. సంధ్య బాధ్యతమీద నడుస్తున్నాయి."

సంధ్య ఎవరో అడగలేదు సౌమిత్రి. టీచర్‌గా పనిచేస్తున్న అమ్మాయి, ఇరవై ఏళ్లు నిండని విధవ, మూడేళ్లు నిండని కొడుకు. ఆమె మేనమామను మెచ్చింది. పట్టణం నుండి వచ్చింది. పల్లె చేరి పెళ్ళి చేసుకొన్నది. రెండేళ్లు గడవకముందే భర్త పోయాడు. బ్రతుకు ముష్టి చేదయింది. ఆయా ఎభై పైబడి నలుగురు కొడుకులున్న అనాథ! ఆమెకు కష్టంచేసే కాలం దాటిపోయింది. పోషణకు వంతులు పోక కొడుకులు గాలికి వదిలేశారు. మనిషిలో స్వార్థం కరుడుగట్టింది. ఏ ఆదరణ లేని యువతికి, ముసలమ్మకు జీవనోపాధి శిశువిహార్. పిల్లలకు బిస్కెట్లు, పాటలు, ఆటలు, చదువు పట్ల చిన్నపిల్లలకు ఆసక్తి కలిగించడానికి శిశువిహార్. పిల్లలు పొలాల వెంట పడకముందే వారిని తీపి చూపి ఆకర్షించడం, కాయకష్టానికెళ్లే తల్లి తండ్రులకు గుదిబండలు కాకుండా నివారించడం టీచరు, ఆయాల పని.

**పిల్లలు పొలాల వెంట పడకముందే వారిని తీపి చూపి ఆకర్షించడం టీచర్లు, ఆయాల పని.**



సాయంకాలం కొబ్బరిచెట్లు చల్లని గాలిని విసురుతున్నాయి. మేడమీద రవి, సౌమిత్రి, రేణుకాదేవి కూర్చున్నారు. రేణుకాదేవి మనస్సులో మెదలుతున్న మాట పెదవి దాటి బయట పడింది.


"సౌమిత్రీ! రవి విషయం నీవైనా తేల్చగలవా? వీడి మనస్సులో ఏముందో తెలుసుకోవడం నా తరం కావడంలేదు. ఉద్యోగం చేస్తావా అంటే, మనం చాలామందికి బ్రతుకుతెరువు కల్పించగలం అంటాడు. రవి మేనమామల కూతుళ్ళిద్దరున్నారు. ఒక అమ్మాయి ఇంజనీరింగ్ చదువు ఈ సంవత్సరంతో పూర్తి అవుతుంది. మంచి తెలివితేటలు గల అమ్మాయి. మరో అమ్మాయి బి.ఏ చదివింది. సంగీతం, నాట్యం బాగా నేర్చింది. ఇద్దరిలో రవి ఎవరిని పెళ్లి చేసుకొన్నా ఇబ్బంది ఉండదు. రవికి నీ మాట మీద గురి ఉన్నట్లుంది. నీవైనా చెప్పి చూడు, బాబూ!"

అంతవరకు ఎంతో చనువుగా అమ్మతో మాట్లాడిన రవి మౌనం వహించాడు. సౌమిత్రి మిత్రుని వైపు

పరిశీలనగా చూశాడు. రవి దూరంగా గోధూళిలో కదిలే జీవచ్ఛవాలపై దృష్టి కేంద్రీకరించాడు. రేణుకాదేవి నిట్టూర్చింది.

స్టేషనులో జనం లేరు. ఉదయం ఐదుగంటలు. మసకచీకటి. చల్లగాలి ఆహ్లాదంగా ఉంది. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రావడానికి ఇంకా టైమ్ ఉంది. సృష్టిలో అన్నిటికంటే తియ్యనిది స్నేహం. ఆ తియ్యదనం పంచుకొన్న మిత్రులు సౌమిత్రి, రవి. సౌమిత్రి రవిని నిశితంగా చూశాడు. రవి చెప్పకనే కలెక్టర్ కావాలన్న తనకు కొన్ని పరీక్షలు పెట్టాడు. సెకండ్ క్లాసు రైలుప్రయాణం, బస్సు ప్రయాణం, చీకటి నడక, ఈత నేర్పాడు. సామాన్యమైన మనిషి బ్రతుకును కన్నుల ముందు చూపించాడు. రవిలో ఎంత జీవితావగాహన ఉంది! మిత్రునిపై అభిమానం కొండంతలుగా పెరిగింది సౌమిత్రికి.

మనిషిలో విభిన్న మనస్తత్వాల విశ్లేషణ - నాటక కెలిడియోస్కోపులో అద్భుతంగా చూపిన షేక్స్పియర్, సైతాన్‌లో మానవతా స్పృహ ప్రేరణకు అద్వితీయ భావనాశక్తితో అద్దంపట్టిన మిల్టన్, కమనీయ కల్పనలతో శృంగార రస స్వరూపాన్ని రమణీయంగా చిత్రించిన షెల్లీ, కీట్స్, ప్రాచ్య వేదాంత జీవధారను కవితలో మేళవించిన ఇలియాట్ - ఎందరో కవులు! వారి రచనలు సౌమిత్రి స్మృతిలో కదిలాయి. జీవితం చిత్ర విచిత్రాల కలయిక. కళ, విజ్ఞానం - అన్నీ జీవితాన్ని మెరుగుపరచడానికే. సౌమిత్రిలో ఆలోచన కదిలింది.



**సౌమిత్రికి ఉదయసంధ్య కౌగిలిలో రవి అందంగా కనిపించాడు.**

రవి ఏమిటో పెంచి పెద్ద చేసిన అమ్మకే సరిగా అర్థం కాలేదు. తను ఇంగ్లీషు లిటరేచర్ చదివాడు. అతను చరిత్ర చదివాడు. యూనివర్సిటీ డిబేట్స్‌లో ఇద్దరికీ పోటీ. తన వాక్చాతుర్యానికంటే అతని జీవితావగాహనం మిన్న. ఎంతటి సన్నిహిత మిత్రుడైనా అతని జీవిత ధ్యేయం ఏమిటో అర్థంకాలేదు. తనేం చెప్పగలడు? రవి మనసేమిటో తెలుసుకోవాలని పించింది. సౌమిత్రి అదను చూసి ప్రశ్న వేశాడు.

"రవీ! ఒక మాటడగనా?"

"ఏమిటది?" కుతూహలంగా ఎదురుచూశాడు రవి.

"మీ అమ్మకు నీవంటే ప్రాణం. కాని ఏదో విషయంలో నువ్వు ఆమె మాటను మన్నించడం లేదు. ఆమెలో అసంతృప్తి గూడుకట్టుకొన్నట్లుంది."

రవి దీర్ఘంగా నిట్టూర్చాడు.

"నిజమే. తల్లి మాటను జవదాటడం కన్నకొడుకు చేయరాని నేరం. తల్లి కోరిక నెరవేర్చలేని అసమర్థుణ్ణి. కాని నేను ఆమె ఆజ్ఞను తిరస్కరించలేదు. ఆలోచన ఉంది. అందుకే ఆమె కోరికను మన్నించలేకపోతున్నాను, నాకోసం, ఆమె కోసం, చుట్టూ ఉన్న ప్రజల సుఖశాంతుల కోసం."

అతని కన్నుల్లో విషాదం, మాటల్లో బాధ ఉన్నాయి. నెమ్మదిగా, నిశ్చలంగా విషయం చెప్పాడు రవి:

"అప్పుడు నేను ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. ఒకరోజు రాత్రి నడిజాము సమయం-ఒకాయన వచ్చి నిద్రలేపాడు హాస్టల్లో. చాలా గాబరాగా ఉన్నాడు. విషయం చెప్పలేదు. తొందరగా ఇంటికి వెళ్ళాలి అని చెప్పాడు. తెల్లవారక ముందే ఎలాగో ఇల్లు చేరాము. ఇంటి చుట్టూ జనం సందడి. ఇంటి ముందు మా నాన్న శవం. అర్థం కాలేదు. ఎవరో హత్యచేశారని తెలిసింది. ఆయనతో పాటు నీడలా అనుసరించే మిత్రుని కూడా హత్య చేశారు. కారణం చిన్నదే. రాజుకొని భగ్గుమన్నది. హత్య, దాని పర్యవసానం. హింసాభయం దవానలంలా ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టింది. గాలి పీల్చుకొనే వ్యవధిలేదు. పోలీసులొచ్చారు. శవాలను జిల్లా కేంద్రం హాస్పిటల్‌కు తరలించారు. సాయంకాలానికి రెండు మూటల్లా వచ్చాయి. మా నాన్న, ఆయన మిత్రుడు బూడిదయ్యారు. నా తండ్రిని చంపిన వారి శవాలు మట్టిలో కలవాలని తల్లి కోరిక. నా మేనమామలు అందుకు ప్రతిన బూనారు. ఎవరు చంపారో తెలుసు. అట్టడుగు వర్గానికి చెందినవారు. వారికి కక్షలేదు. ఎవరి ప్రోద్బలంతోనో, పేరాశతోనో చేసిన హత్యలు. హత్యలకు సాక్ష్యాలు లేవు. కాని సాక్షులు చాలామంది ముందుకొచ్చారు. వారు హత్య చూడలేదు. అయినా సాక్ష్యమిస్తామన్నారు. వారు నాన్న ఆశ్రయంలో పెరిగిన సామాన్యులు. వారి కుటుంబాలు భయంతో వణకిపోయాయి. బలిసిన కోడెల కుమ్ములాటలో లేగలు నలిగినట్లు సామాన్యుల బ్రతుకులు కుంటుపడ్డాయి. కేసు నడిచింది. లక్షల డబ్బు ఖర్చయింది. నేను ఏం చేస్తున్నానో, ఎటు వెళ్తున్నానో తెలియని ఎడారి ప్రయాణం. నా చుట్టూ ఎప్పుడూ పదిమంది. అయినా శూన్యంలో ప్రయాణం. చదువు ఆగిపోయింది. రెండేళ్ళు గడిచింది.

మా నాన్న ప్రాణానికి ప్రాణం అడ్డుపెట్టిన స్నేహితుని కూతురు సంధ్య. పదో క్లాసు పాసయింది. అతి సామాన్య కుటుంబం. ఒక గంటసేపు నాతో మాట్లాడింది. కాలేజీలో చదవాలని ఆమె కోరిక. మంచి మార్కులు వచ్చాయి. సమంజసమైన కోరిక. నేనొక భూతాన్ని వెంటాడుతున్నా నన్నది, నా వెనుక మరో పెను భూతం నన్ను వెన్నంటి ఉందన్నది నిజం! పగ కలిగి బ్రతకడం, పామున్న ఇంట్లో బ్రతకడం ఒకటే.

నా జీవిత గమ్యం మారింది. మామిడితోపులో బావి తవ్వించాను. పరిగిలిపోయిన తోపు బాగు పడింది. నికరాదాయం స్థిరపడింది. తిరిగి కాలేజీలో చేరాను. తప్పుడు సాక్ష్యాలు వద్దన్నాను. అందరికీ ఆశ్చర్యం. సాక్షుల కుటుంబాలు సంతోషించాయి. కేసు పోయింది. తండ్రిని చంపిన వారిపై పగ తీర్చుకోలేని పిరికి పందను. తల్లి పంతం నెరవేరలేదు. అంటే మరో తల్లి మంగళసూత్రం స్థిరపడింది. అది అమ్మ అసంతృప్తికి కారణం."

రవి గుండె బరువు తగ్గింది. మనసు తేలిక పడింది. సౌమిత్రి అంతవరకు ఉత్కంఠతో వింటున్నాడు. రవిని పరిశీలిస్తున్నాడు. తూర్పుగా దృష్టి మళ్ళించాడు. సూర్యకిరణాల తేజస్సుతో ఆకాశం తెల్లబడుతూ ఉంది. ప్రకృతి గాఢనిద్ర నుండి మేల్కొంటూ ఉంది.

రవికి తండ్రిని చంపిన వారి నామరూపాలు లేకుండా చేయగల శక్తి సామర్థ్యాలున్నాయి. కావాలనుకుంటే పెద్ద ఉద్యోగం వస్తుంది. చేయి చాస్తే అందుకోవడానికి కోటీశ్వరులైన మేనమామల కూతుళ్ళున్నారు. మరి, రవి ఎందుకు వీటన్నిటినీ వదులుకొంటున్నట్లు? ఎడారిలాంటి ప్రదేశంలో ఏం చేయాలనుకుంటున్నాడు? సౌమిత్రి ఆలోచన సాగింది. కేవలం కనుచూపు మేర ఇసుక ఉన్న ప్రదేశం మాత్రమే ఎడారి కాదు. మనుషులున్నా కక్షలు రాజుకునే ప్రదేశం ఎడారికన్న భయంకరం! అది సామాన్య జనం జీవితాలను నిస్సారం చేయగల మరుభూమి. ఎడారిలో ఎక్కడో ఒకచోట సారవంతమైన ప్రదేశం ఒయాసిస్. ఎడారి ఎంత ఉన్నా నిష్ప్రయోజనమే. ఒయాసిస్‌కే ప్రాధాన్యం-ప్రజలు చల్లగా సేదతీర్చుకొనే ప్రదేశం. సామాన్యమైన మనిషి స్వేచ్ఛగా, నిండుగా బ్రతకడానికి అవకాశం కల్పించడం నిజమైన సేవ. మానవత ఉన్న మనిషి ఈ సమాజంలో ఒయాసిస్. రవి మనుషులున్న ఎడారిలో ఒయాసిస్. ఎడారిని సారవంతం చేయగల వ్యక్తి అనిపించింది సౌమిత్రికి. పగలే చీకటిగా బ్రతికే సామాన్య జనానికి సహాయం అవసరం.

రవి పగను ఎందుకు విడిచిపెట్టాడు? మానవతగల మనిషిగా ఎలా మారాడు? అతనిలో నిండుకుండలాంటి నిశ్చల ప్రశాంతి ఎలా నెలకొన్నది? ఎడారిలో ప్రయాణించే వారికి ఒయాసిస్‌లా కనిపించి భ్రమింపజేసే మరీచిక లెన్నో! అసలు ఎడారిలో ఒయాసిస్ ఉంటుందా? అదీ ఒక కల్పనా? భ్రమా? సౌమిత్రి ఆలోచనలో మెరుపు మెరిసింది.

"రవీ! సంధ్య ఎక్కడ ఉంది?"

"బి.ఎ. పూర్తిచేసింది. ఎమ్.ఎ. ప్రైవేటుగా చదువుతూ, స్వచ్ఛంద సేవాసంస్థలో శిక్షణ పొందుతూ ఉంది తిరుపతిలో."

సౌమిత్రి సందేహాలు తీరాయి. అతని ప్రశ్నలకు జవాబు సంధ్య! అగ్గిని అగ్గతో ఆర్పలేము. మంటకు ఆజ్యం విరుగుడు కాదు. అగ్గిని నీటితోనే ఆర్పగలం. ఇది సంధ్య సందేశం. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ వచ్చింది. మిత్రుల చేతులు కలిశాయి. చూపులు మాట్లాడుకున్నాయి. రైలు కదిలింది. తూర్పు దిక్కుగా వెళ్తూ ఉంది వేగంగా. సౌమిత్రికి ఉదయ సంధ్య కౌగిలిలో రవి అందంగా కనిపించాడు.